లింకురోడ్లను పూర్తి చేయాలి


జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌తో సమావేశమైన ఎమ్మెల్యే గాంధీ

జీహెచ్‌ఎంసీ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌ను కలిసిన ఎమ్మెల్యే గాంధీ

గచ్చిబౌలి: స్థల సేకరణ పూర్తై పెండింగ్‌లో ఉన్న లింకురోడ్డు పనులు త్వరితగతిన చేపట్టేలా, సాంకేతిక అడ్డంకులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని జీహెచ్‌ఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే గాంధీ కోరారు. బుధవారం ఆయన సిటీ ప్లానర్‌ను కలిసి శేరిలింగంపల్లి నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. శ్రీదేవి థియేటర్ రోడ్డు విస్తరణ పనుల్లో వేగం, జేఎన్‌టీయూ నుంచి ప్రగతినగర్ వరకు రోడ్డు విస్తరణ, ఫ్లైఓవర్ నిర్మాణం, అపర్ణాహిల్స్ పార్క్ నుంచి గంగారం చెరువు వద్దకు లింకు రోడ్డు పనులు, హెచ్‌ఎంటీ స్వర్ణపురి నుంచి పీజేఆర్ ఎన్‌క్లేవ్ వరకు లింకు రోడ్డు, నల్లగండ్ల నుంచి శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయం వరకు లింకు రోడ్డు, మియాపూర్ ప్రధాన రహదారి నుంచి కల్వరీ టెంపుల్ మీదుగా విజ్ఞాన్ స్కూల్ వరకు లింకు రోడ్డు, ముంబై జాతీయ రహదారి పై హోమ్ జ్యూవెల్ నుంచి రైల్వే ట్రాక్ మీదుగా జోనల్ కార్యాలయం వరకు లింకు రోడ్డు, హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని నాగార్జున హోమ్స్ లింకు రోడ్డు పనులు వేగవంతం చేయాలని సూచించారు. పెండింగ్ పనుల పూర్తికి తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారని గాంధీ తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి


డీసీ ముకుంద్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లోని కాలనీలు, బస్తీలలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పనకు సహకరించాలని శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డిని బుధవారం కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కోరారు. జోనల్ కమిషనర్ కార్యాలయంలో ఆయనను కలిసి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, అసంపూర్తిగా ఆగిపోయిన పనులను ఆయనకు వివరించారు. ముఖ్యంగా నేతాజీ నగర్, రాయదుర్గం, మంజీరా డైమండ్ హైట్స్, నల్లగండ్ల, హుడాకాలనీ, నానక్‌రాంగూడలలో సీసీ రోడ్లు గుంతలు పడడంతో చిన్నపాటి వర్షానికి నీరు నిలిచి ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కొత్త రోడ్లు వేయాలని అలాగే గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని జనాభా దృష్ట్యా రోడ్డు విస్తరణ కూడా చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం శేరిలింగంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేలా చూడాలని కోరారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యలపై, చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు అలోక్, అతుల్‌మోహిత్,రాకేష్,రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా దుకాణాలకు అనుమతి తప్పనిసరి

చందానగర్ సర్కిల్ ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి


టపాసుల వ్యాపారులతో సమావేశమైన అధికారులు

చందానగర్: అన్ని రకాల అనుమతులుంటేనే టపాసుల దుకాణాలు ఏర్పాటు చేయాలని చందానగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులు, టపాసుల వ్యాపారులతో చందానగర్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా టపాసుల దుకాణాలు ఖాళీ స్థలాలలోనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. గంగారం బేబీపాండ్ వద్ద టపాసుల దుకాణానికి అనుమతిస్తామని, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. సర్కిల్ కార్యాలయం ఆవరణలోని కళ్యాణ మంటపంలో దుకాణాల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వడం లేదని ఆయన స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీతో పాటు విధిగా పోలీసు, అగ్నిమాపకశాఖ అనుమతులు స్థల, దుకాణ యజమానుల ఎన్‌ఓసీ తీసుకోవాలన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవన్నారు. ట్రేడ్ లైసెన్సు లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ సమావేశంలో సర్కిల్ జీహెచ్‌ఎంసీ అధికారులు, చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి, మియాపూర్, మాదాపూర్ పోలీసు అధికారులు, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ రవి, విజయ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాజేంద్రనగర్: ప్రభుత్వ స్థలంలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను రాజేంద్రనగర్ తహసీల్దార్ రాములు ఆధ్వర్యంలో బుధవారం కూల్చివేశారు. కాటేదాన్ టీఎన్‌జీఓఎస్ కాలనీ సర్వే నంబర్ 156/1లో ప్రభుత్వ స్థలంలో ఇద్దరు వ్యక్తులు రెండు నిర్మాణాలను చేపట్టారు. స్థానికుల ఫిర్యాదు మేరకు తహసీల్దార్ రాములు ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టిన అధికారులు సదరు స్థలాన్ని ప్రభుత్వ స్థలంగా గుర్తించారు. బుధవారం పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు చేపట్టారు. ఈ సందర్భంగా కూల్చివేతలను అడ్డుకున్న కబ్జాదారులు జేసీబీపై రాళ్లతో దాడి చేయడంతో జేసీబీ అద్దాలు ధ్వంసమయ్యాయి. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తాము రూ, లక్షలు వెచ్చించి స్థలాన్ని కొనుగోలు చేశామని... ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం అన్యాయమంటూ వాపోయారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేస్తామన్నారు. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు సైతం నమోదు చేస్తామన్నారు. సర్వే నంబర్ 156/1లో నిర్మాణాలు చేపట్టిన స్థలం ప్రభుత్వ స్థలమన్నారు.

దేవాలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దేవాలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు చర్యలు చేపట్టారు. స్థానికుల సహకారంతో దేవాలయ కమిటీల ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలోని దేవాలయాలపై దాడుల నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇన్‌స్పెక్టర్ క్యాస్ట్రో ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని ముఖ్య దేవాలయాలతో పాటు బస్తీలు, కాలనీల్లో చిన్న దేవాలయాల వివరాలను సేకరించారు. దేవాలయ కమిటీ సభ్యులతో సమావేశాన్ని నిర్వహించి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు లేని దేవాలయాల వద్ద స్థానికుల సహకారంతో కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నారు. స్టేషన్ పరిధిలోని అన్ని దేవాలయాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేపట్టేందుకు చర్యలు ప్రారంభించారు. మరో వారం రోజుల్లో అన్ని దేవాలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

కనీస వసతులు కరువు

గంగారం శ్మశానవాటికలో స్నానపు గదులు, మరుగుదొడ్లు లేక ఇబ్బందులు


గంగారం శ్మశానవాటిక



చందానగర్: చందానగర్ పరిధి గంగారం గ్రామ శ్మశానవాటికలో కనీస వసతులు కరువయ్యాయి. మహాప్రస్థానంగా అభివృద్ధి చేయడానికి జీహెచ్‌ఎంసీ, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శ్మశానవాటికకి వచ్చే వారికి స్నానపు గదులు, మరుగుదొడ్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకోవాలి. అస్థికలను భద్రపరుచుటకు ప్రత్యేక గదిని నిర్మించాలి. ఈ ప్రాంతంలో చెత్తచెదారం వేయకుండా జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలి. శ్మశానవాటికలో అంత్యక్రియల కార్యక్రమాలు నిర్వహించే కుటుంబాలకు గదులు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.


పని చేయని చేతి పంపు


శ్మశానవాటికలో చెత్త చెదారం

అభివృద్ధి చేయాలి



గంగారం శ్మశాన వాటికలో కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శ్మశాన వాటికను ఉన్నతాధికారులు ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలి. – తిమ్మారెడ్డి, చందానగర్

చేతిపంపును బాగు చేయించాలి



శ్మశానవాటికలో స్థానిక ప్రజలు చెత్త వేస్తున్నారు. ప్రధాన ద్వారం ముందు చిరు వ్యాపారుల దుకాణాల ఏర్పాటుతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాటికలో నిరుపయోగంగా మారిన చేతి పంపును బాగు చేయించాలి.
– వెంకటేష్, గంగారం

దరఖాస్తుల ఆహ్వానం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ విశ్వవిద్యాలయంలోని సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ కోర్సులలో అడ్మిషన్ల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. బీఈడీ (డిస్టెన్స్ మోడ్) కోర్సులో డీఈఐ ఈడీ పూర్తి చేసిన ఉపాధ్యాయులు అర్హులు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌ను సమర్పించడానికి చివరి తేదీ అక్టోబర్ 30గా నిర్ధారించారు. వివరాలను ఈ–ప్రాస్పెక్టస్, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌లు వెబ్‌సైట్, అడ్మిషన్ పోర్టల్‌లో పొందవచ్చు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలి. అర్హత పరీక్ష ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎర్లీచైల్డ్ హుడ్ కేర్, ఎడ్యుకేషన్, స్కూల్ లీడర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ వంటి ఇతర దూర విద్య డిప్లొమో కోర్సులలో నమోదు చేసుకోవచ్చు. ఈ కోర్సులలో ప్రవేశానికి చివరి తేదీ నవంబర్ 14 తేదీగా నిర్ణయించారు. మరిన్ని వివరాలకు విద్యార్థుల హెల్ప్‌లైన్ల కోసం 040–23008463, 040–23120600, ఎక్స్‌టెన్షన్ నంబర్ 2207 లేదా 2208లో సంప్రదించాలి.

అద్దెకు ఆర్టీసీ బస్సులు

మియాపూర్: వివాహాది శుభ కార్యాలకు ఆర్టీసీ మియాపూర్– 2 డిపో నుండి బస్సులను అద్దెకు ఇవ్వనున్నట్టు మేనేజర్ వెంకటేశం బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మియాపూర్, బాచుపల్లి, గండిమైసమ్మ, నిజాంపేట్, పటాన్‌చెరు, బీహెచ్‌ఈఎల్ ,రామచంద్రాపురం తదితర ప్రాంతవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. 35 మంది ప్రయాణికులుంటే ఇళ్ల వద్దకే బస్సులు పంపిస్తామని వివరాలకు 8008336063, 9059162162, 8008430202 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

రోలర్ స్కేటింగ్‌లో సత్తా చాటిన పూజ



మియాపూర్: రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌లో కెనరి ద స్కూల్‌కు చెందిన పూజ కరికేటి సత్తాచాటారు. అక్టోబర్ 5 నుండి 8వ తేదీ వరకు జరిగిన 62వ రోలర్ స్కేటింగ్ నేషనల్స్‌లో 9–11 బాలికల విభాగంలో పూజ 7పాయింట్లతో ద్వితీయ స్థానంలో నిలిచింది. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ మేరకు విద్యార్థిని పూజని పాఠశాల చైర్‌పర్సన్ శ్వేతారెడ్డి, ప్రిన్సిపాల్ లిడియా క్రిస్టీనా, స్కూల్ హెడ్ సీనియర్ నవీన్‌కుమార్, కో ఆర్డినేటర్లు అభినందించారు.

డ్రగ్స్‌పై అవగాహన సదస్సు


కార్యక్రమంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ

పటాన్‌చెరు టౌన్: డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దామని తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డీఎస్పీ పుష్పన్ కుమార్ అన్నారు. బుధవారం పటాన్‌చెరు మండలం నందిగామ గ్రామ పరిధిలోని రెసొనెన్స్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో డీఎస్పీ పుష్పన్‌కుమార్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, డ్రగ్స్‌కు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. డ్రగ్స్ కొన్నా.. అమ్మినా చట్టరీత్యా నేరమని చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో బీడీఎల్ సీఐ స్వామిగౌడ్,యాంటీ నార్కొటిక్స్ బ్యూరో సీఐ రామనాయక్, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

9 ,10 తేదీల్లో ప్రత్యేక ఓటర్ నమోదు


మాట్లాడుతున్న ఓటర్ నమోదు అధికారి దేవుజా

పటాన్‌చెరు టౌన్: నవంబర్ 9 ,10వ తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని ఓటర్ నమోదు అధికారి దేవుజా అన్నారు. బుధవారం పటాన్‌చెరు తహశీల్దార్ కార్యాలయంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ . ... ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహా రెడ్డి , బీజేపీ నాయకులు శ్రీనివాస్ గుప్తా, నరేష్, బీఆర్ఎస్ పార్టీ శ్రీధర్, టీడీపీ నాయకులు మహమ్మద్ నజీర్, బీఎస్పీ నాయకులు ప్రశాంత్ కుమార్, సీపీఎం నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

హైదర్‌నగర్ బస్తీ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలి


వినతిపత్రం చూపుతున్న సీపీఎం నాయకులు

కూకట్‌పల్లి: హైదర్‌నగర్ బస్తీ హిందూ శ్మశానవాటికను అభివృద్ధి చేయాలంటూ బుధవారం కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎం.శంకర్, శ్రీను, రాములు మాట్లాడుతూ శ్మశానవాటికలో విద్యుత్ స్తంభాలు వేసి, వీధిలైట్లు , ప్రహరీగోడ, సీసీ రోడ్డు వేయాలని కోరినట్లు తెలిపారు. త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని జెడ్‌సీ హామీ ఇచ్చారని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


కౌన్సిలింగ్ ఇస్తున్న పోలీసులు

రాజేంద్రనగర్: ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ అన్నారు. పిల్లర్ నంబర్ 158 వద్ద సర్వీసు రోడ్డులో అక్రమ పార్కింగ్‌పై సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వాహనాలను తొలగించి వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తూ ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్, ఎస్సై రాజేందర్, ఏఎస్సై రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చందానగర్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ నాగేశ్వర్‌రావు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేతాజీనగర్‌లో నివాసం ఉండే బోయ శ్రీనివాస్(20) ఎలక్ట్రీషియన్. ఈనెల 16న రాత్రి 10 గంటల సమయంలో అదే కాలనీలో ఉంటున్న స్నేహితుడు సతీష్ బర్త్‌డే వేడుకకు వెళ్లాడు. రాత్రి 1.30 గంటల సమయంలో ఆటోలో డిన్నర్ చేసేందుకు స్నేహితులు సతీష్, లోకేష్, కృష్ణ, శేఖర్‌తో కలిసి వెళ్లారు. గుల్‌మొహర్ కాలనీ సమీపంలో పెట్రోల్‌బంకు వద్ద ఆటోను అతి వేగంగా నడుపుతూ ముందున్న డీసీఎం వ్యాన్‌ను ఢీ కొట్టాడు. దీంతో బోయ శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. మరుసటి రోజు కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి వెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని, ఉస్మానియా హాస్పిటల్‌కు వెళ్లాలని అక్కడి డాక్టర్లు సూచించారు. ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 5.30 గంటలకు శ్రీనివాస్ మృతి చెందాడు. తండ్రి బోయ వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డంప్‌యార్డు.. కాలనీవాసుల అవస్థలు..



కంపుతో నిద్ర కరువైందంటున్న స్థానికులు

పటాన్‌చెరు: అమీన్‌పూర్ పట్టణంలో కాలనీల మధ్య చెత్త డంప్ చేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. పట్టణంలో దాదాపు 150 కాలనీల నుంచి సేకరించి తీసుకువస్తున్న చెత్తను సర్వే నంబర్ 993 ప్రాంతంలోని గుట్టల్లో డంప్ చేస్తున్నారు. ఏరోజుకారోజు చెత్తను హైదరాబాద్‌లోని జవహర్‌నగర్ యార్డుకు తరలించాలి. కానీ వారంలో ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే చెత్తను అక్కడకు తరలిస్తున్నారు. దీంతో ఇడంపాడులో భారీగా చెత్త పేరుకుపోవడంతో దోమలు, ఈగలు ప్రబలాయి. కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. శ్వాస సంబంధిత వ్యాధులతో సతమతమవుతున్నారు.గత 15 రోజులుగా డంపు నుంచి దుర్వాసన వెలువడుతుండడంతో టెరస్ కాలనీ, మోడీ కాలనీ ప్రజలు అవస్థలు పడుతున్నారు. స్వచ్ఛమైన గాలి పీల్చుకునే పరిస్థితి కూడా లేదని వారు వాపోతున్నారు.

రాత్రిపూట నిద్రపోలేకపోతున్నాం..

రాత్రిపూట డంప్ యార్డు నుంచి చెత్తను తరలించే క్రమంలో కంపు వాసన వస్తుంది. రాత్రిపూట నిద్రపోయే పరిస్థితి కూడా లేదు. చెత్తను ఏ రోజుకు ఆ రోజు తొలగించాలి. డంప్ యార్డును ఇక్కడి నుంచి తీసివేయాలి.
– రామ్ దివాకర్, మోడీ కాలనీ, అమీన్‌పూర్

సమస్య పరిష్కరిస్తాం

డంప్ యార్డుతో ఉత్పన్నమవుతున్న సమస్యలను పరిష్కరిస్తామని అమీన్‌పూర్ మున్సిపల్ కమిషనర్ జ్యోతిరెడ్డి అన్నారు. డంప్‌యార్డ్ నుంచి చెత్తను ఏరోజుకారోజు జవహర్ నగరకు తరలించేలా చూస్తాం. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
– జ్యోతి రెడ్డి కమిషనర్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: మదీనాగూడ సబ్‌స్టేషన్, హెచ్‌ఎంటీ కాలనీ, బీకే ఎన్‌క్లేవ్, ఎఫ్‌సీఐ ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ ఎస్. శ్రీనివాస్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటల నుండి 12 గంటల వరకు హెచ్‌ఎంటీ కాలనీ ఫీడర్ పరిధిలోని కృషినగర్, ప్రశాంత్‌నగర్, ఎంఏనగర్, ఎలియన్స్ అపార్ట్‌మెంట్, రాఘవేంద్ర పాంచజన్య అపార్ట్‌మెంట్, బీకేఎన్‌క్లేవ్ పరిధిలోని జనప్రియ వెస్ట్‌సిటీ, మక్తమహబూబ్‌పేట, కృష్ణసాయి ఎన్‌క్లేవ్, జేపీఎన్‌నగర్, ఎఫ్‌సీఐ ఫీడర్ పరిధిలోని వీడియా కాలనీ, ఎఫ్‌సిఐ కాలనీ, టీఎన్‌నగర్, చిరంజీవి నగర్, అమాన్‌కాలనీ అదేవిధంగా శిల్పాలేఅవుట్, ఆర్టీసీ కాలనీ రోడ్డు నంబర్–18 నుండి 22 వరకు ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు.

జిల్లాస్థాయి క్రీడా పోటీలకు త్రివేణి స్కూల్ విద్యార్థి ఎంపిక



చందానగర్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో రంగారెడ్డి జిల్లా అండర్–14 బాలుర విభాగం జట్టుకు మదీనాగూడలోని త్రివేణి స్కూల్ విద్యార్థి సుజితి ఎంపికయ్యాడు. బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ డాక్టర్. వీరేంద్రచౌదరి సుజితిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో చదువుతోపాటు క్రీడలలో రాణించే విద్యార్థులను ప్రోత్సహిస్తామన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, కోచ్‌లు సుజితిని అభినందించారు.

ఎల్ఆర్ఎస్ పరిష్కార వేదిక..


దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కమిషనర్ సంగారెడ్డి

రామచంద్రాపురం(పటాన్ చెరు): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు మరింత మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రతి మంగళ, బుధవారాల్లో ఎల్ఆర్ఎస్– 2020 పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తెలిపారు. బుధవారం తెల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ –2020 పరిష్కార వేదికను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ వేదిక ద్వారా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సీఎంఆర్ఎఫ్ మంజూరుపత్రాలు అందజేత


మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో పలువురికి మంజూరైన 1లక్ష 20 వేల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు బుధవారం ఎమ్మెల్యే గాంధీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అశోక్ గౌడ్, నాయకులు నాయినేని చంద్రకాంత్ రావు, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, బ్రిక్ శ్రీనివాస్, పోతుల రాజేందర్, ఎండి ఇబ్రహీం,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

28న భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డా.హేమంత్ తెలిపారు. ఈ నెల 28న ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టీసీ బస్ టెర్మినల్‌లో రెండవ అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో, భాగ్యనగర్ కాలనీ, అర్జున్ థియేటర్ లైన్‌లోని గ్రేస్ సెక్యూరిటీ సర్వీస్ కార్యాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాక సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రంగారావు

పటాన్‌చెరు టౌన్: ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికకు నవంబర్ 6వ తేదీ లోపు అర్హులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలని పటాన్‌చెరు తహసీల్దార్ రంగారావు సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం పటాన్‌చెరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల ప్రిన్సిపాల్‌లు ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంను వేగవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నాగేశ్వర్ నాయక్, ఎలక్షన్ డీటీ సంతోష్ కుమార్, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్ అమరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన


కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని కాలనీలలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని కార్పొరేటర్ పుష్పనగేష్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని మయూరినగర్ కాలనీలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలో త్వరలో సీసీ రోడ్లు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పారిశుద్ధ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు.